క్లుప్తంగా

ఉత్సాహంగా వినాయక నిమజ్జనం



ఈదరలో వినాయక విగ్రహం ఊరేగింపులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌తో సందడి చేస్తున్న బూచేపల్లి అభిమానులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈదర, పులిపాడు, ఉమామహేశ్వరపురం గ్రామాల్లో ఏడో రోజు నిమజ్జన కార్యక్రమాలలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈదర గ్రామంలో బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ, బూచేపల్లి అభిమానులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్లతో కదంతొక్కారు. యువత కోలాహలంగా గులాములు చల్లుకుంటూ కేరింతలుకొడుతూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకు కూరలు బలమైన పౌష్టికాహారం



చిన్నగుడిపాడులో పోషకాహార ర్యాలీ

దొనకొండ: గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు వాడితే దానిలో తగినంత పోషకాలు, విటమిన్స్, మినరల్స్ అందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి తెలిపారు. మండలంలోని ఆరవల్లిపాడు సెక్టార్ చిన్నగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ఆకు కూరలు, చిరు ధాన్యాలు, నెయ్యి, గుడ్లు, పాలు క్రమం తప్పకుండా తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలుపద్మ, ఆయా మహాలక్ష్మి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులు




ఏచూరికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

యర్రగొండపాలెం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం స్థానిక పూలసుబ్బయ్య శాంతి భవన్‌లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం సీపీఎంలో చేరిన ఏచూరి అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.వి.కృష్ణగౌడ్, ఏఐటీయూసీ నాయకులు ఆవుల నాగయ్య, సాంబశివరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ముండ్లమూరు (దర్శి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ మండలంలోని వేంపాడు గ్రామంలో శుక్రవారం సీపీఎం నాయకుడు పంటా ఏడుకొండలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం నాయకులు బోడపాటి హనుమంతరావు, సత్యం, మీరావలి, అంజయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, రామాంజనేయులు, మదన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



వేంపాడులో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అధికం..అనర్థం

- పెరుగుతున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం
- సారం కోల్పోతున్న భూమి
- నాణ్యత లేని ఉత్పత్తులు



ఎరువులు కలుపుతున్న రైతు

పుల్లలచెరువు: బస్తాలకు, బస్తాల ఎరువులు... డబ్బాలకు, డబ్బాలు రసాయనిక పురుగు మందులను వాడడం వలన తెగుళ్ల నశించడం లేదు సరికదా కొత్త తెగుళ్ల పుట్టుకొస్తున్నాయి. ఏటేటా అధిక శక్తి కలిగిన మందులు పిచికారి చేస్తూ పోతున్నారు. దీంతో రైతులకు పెట్టుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులపైనా ప్రతి కూల ప్రభావం చూపుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పత్తి, మిరప, వరి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. ఈ మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులను విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం రెట్టింపు అవుతుందని అధికారులు చెబుతున్నారు.

నియోజకవర్గంలోని పరిస్థితి..

నియోజకవర్గంలోని సాగర్ ఆయకట్టు ప్రాంతమైన త్రిపురాంతకం, ఇతర మండలాల్లో బోరు బావుల వద్ద వరి పంటను ఖరీఫ్‌లో సాగు చేస్తున్నారు. రైతులు అవసరానికి మించి 15 నుంచి 25 శాతం అధికంగా ఎరువులు, పురుగుమందులు వాడుతున్నారు. వరి సాగుకు అయ్యే ఖర్చు కంటే పురుగుల నివారణకు వినియోగించే రసాయనిక మందుల ఖర్చు అధికంగా ఉంటుంది. సాధారణంగా ఎకరాకు 2 బస్తాల డీఏపీ, రెండున్నర బస్తాల యూరియా, బస్తా పొటాష్ సరిపోతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కానీ రైతులు అధికంగా ఎరువులను వాడుతున్నారు. దీని వల్ల అధిక వ్యయం అవడమే కాకుండా భూసారం క్షీణించి జీవం లేని భూమిగా తయారవుతోంది. పైగా పురుగు మందులను తట్టుకునే సామర్థ్యం కీటకాలకు పెరుగుతుంది. ఫలితంగా తదనంతరం ఎన్ని మందులు వాడినా కీటకాలు, తెగుళ్ల నశించవు.

వర్మీ కంపోస్టుతో మేలు

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడంతో పాటు భూసారం పెంచేలా వ్యవసాయ శాఖ రైతులను ప్రోత్సహిస్తోంది. వర్మీకంపోస్టు ఎరువుల వల్ల పంటలకు ప్రయోజనంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చని వ్యవసాయాధికారులు ఎంత ప్రచారం చేస్తున్నా రైతులు అంతగా ఆసక్తి చూపకపోవడంతో రైతులే ఇబ్బందులు పడతారని అధికారులు చెబుతున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని రైతులు తక్కువ పెట్టుబడితో నాణ్యమైన వ్యవసాయం చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

> **భూసార పరీక్షలకు అనుగుణంగా..**
> భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులను వినియోగించాలి. విచక్షణా రహితంగా ఎరువులను వాడడం వలన రైతులకు పెట్టుబడి పెరగడంతో పాటు క్రమేపీ భూమి సారం కోల్పోయి పంటలకు పనికి రాకుండా పోతుంది. ఎరువులు అధికంగా వాడకం వలన నష్టమే తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే సాగు వ్యయం తగ్గి భూసారం పెరుగుతుంది. ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా రైతులు ముందుగా మేల్కొంటే పెట్టుబడులు తగ్గించుకునేందుకు వీలుంటుంది.
> – నిర్మలాదేవి, వ్యవసాయాధికారి, పుల్లలచెరువు

రాజీ మార్గంతో సత్వర న్యాయం

- నేడు మార్కాపురంలో జాతీయ లోక్ అదాలత్

పుల్లలచెరువు: న్యాయ స్థానాల్లో కొనసాగుతున్న రాజీకి అవకాశం కలిగిన కేసులను ఇరువర్గాల మధ్య రాజీ రూపంలో పరిష్కరించేందుకు ఈ నెల 14వ తేదీ మార్కాపురం కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమానికి పోలీసులు, న్యాయవాదుల తోడ్పాటుతో విజయవంతం చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారని, లోక్ అదాలత్ పరిధిలోకి వచ్చే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుల్లలచెరువు ఎస్ఐ బాబురావు కోరారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ పరిష్కారానికి అవకాశం ఉన్న కాంపౌండబుల్ కేసులు, కొట్లాటలు, జూదం, రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలు, ర్యాష్ డ్రైవింగ్, జగడాలు, భార్యాభర్తల తగవులు, బహిరంగ ప్రదేశంలో మద్యపానం, భూ వివాదాలు, సివిల్ వివాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాదాలు, న్యూసెన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. పుల్లలచెరువు స్టేషన్ పరిధిలో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కోర్టులో ఉన్న కాంపౌండబుల్ కేసులను సులువుగా పరిష్కరించుకోవడానికి ఈ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తద్వారా కక్షిదారులకు సమయంతో పాటు సొమ్ము ఆదా అవుతుందని చెప్పారు. కక్షలు విడనాడి సామరస్య ధోరణి అవలంబిస్తే కేసుల నుంచి విముక్తి లభించి ఉపశమనం కలుగుతుందన్నారు.

ఉత్తమ బోధనతోనే విద్యార్థుల్లో మార్పు



పీఆర్‌సీ తండా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ఉపాధ్యాయులు తమ నైపుణ్యతను ప్రదర్శించి విద్యార్థులకు ఉత్తమ బోధన చేయడంతోనే విద్యార్థుల్లో మార్పు వస్తుందని ఎంఈవో ఇందిర అన్నారు. శుక్రవారం మండలంలోని పీఆర్‌సీ తండా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఎంఈవో పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. నిరంతరం ఉపాధ్యాయులు తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల వివరాలు, కిట్లకు సంబంధించిన రికార్డులు, మధ్యాహ్న భోజనానికి సంబంధించి రికార్డులను పరిశీలించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని హెచ్‌ఎంను ఆదేశించారు.

కొనుగోలు వస్తువులకు బిల్లు తప్పనిసరి



గొబ్బూరులో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని వ్యవసాయాధికారి కే బుజ్జిబాయి అన్నారు. మండలంలోని గొబ్బూరు గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన అనంతరం పంటల సాగుపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే ఎరువులు, రసాయన మందులు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈనెల 15వ తేదీలోపు నమోదు చేయించుకొని ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు అయిన పచ్చదోమ, తెల్లదోమలు ఉంటే వాటి నివారణకు ఇమిడా క్లోప్రిడ్ లేక నీరు 1:4 నిష్పత్తిలో మొక్క లేత కాండానికి బ్రష్‌తో పూస్తే రసం పీల్చే పురుగులను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ పద్ధతి వలన ఖర్చు తగ్గడమే గాక వాతావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని వివరించారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఎకరాకు ఎసిఫేట్ 300 గ్రాములు లేక థయామేథోక్సామ్ 80 గ్రాముల మందు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం వలన రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చన్నారు.

కొర్రప్రోలు రేంజి
నూతన కార్యాలయ భవనం ప్రారంభం



నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఫారెస్ట్ భవన కార్యాలయ సమదాయంలో నూతనంగా నిర్మించిన కొర్రప్రోలు రేంజి నూతన కార్యాలయ భవనాన్ని మార్కాపురం ప్రాజెక్టు టైగర్ డిప్యూటీ డైరక్టర్ విఘ్నేష్ అపావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సరైన ప్రమాణాలతో భవన నిర్మాణానికి కృషి చేసిన కొర్రప్రోలు రేంజి అధికారి ప్రసన్నజ్యోతిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో రేంజి అధికారులు ప్రసన్నజ్యోతి, విశ్వేశ్వరరావు, నీలకంఠేశ్వరరెడ్డి, వరప్రసాద్, డివిజన్ ఆఫీస్ సూపరింటెండెంట్ వెంకట కృష్ణయ్య, ఏపీజేఎఫ్‌టీఏ మార్కాపురం యూనిట్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎఫ్ఎస్‌ఓ అన్వర్‌బాష, ఏబీఓ. మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.30 వేల విరాళం



విరాళాలు సేకరిస్తున్న వెంకట్రావు, నాగేంద్ర

కురిచేడు: మండలంలోని బయ్యవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కొండ్రు వెంకటరావు తన మిత్రుడితో కలిసి తన స్వగ్రామంలో వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. తన మిత్రుడు యర్రగొండపాలెం సీఆర్పీ దార నాగేంద్ర తమ ఉద్యోగాలకు సెలవు పెట్టి గ్రామంలో విరాళాలు సేకరించారు. వచ్చిన రూ.30 వేలు గ్రామ పెద్దలు సూరే వెంకటస్వామి,"సత్య నారాయణ సర్దార్, మహేష్‌ల సమక్షంలో లెక్కించి యూనియన్ బ్యాంకు ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కు జమచేసినట్లు వెంకట్రావు తెలిపారు. వారిని ఎంపీడీఓ, ఈఓఆర్డీ, సహచర పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేత



విద్యార్థినులకు శ్యానిటరీ నాప్‌కిన్స్ పంపిణీ చేస్తున్న మహిళా సభ్యులు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం బాలికలకు నాప్‌కిన్‌లు అందజేశారు. విజయవాడ జనక్రాంతి ట్రస్ట్ సౌజన్యంతో మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవ వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు నాప్‌కిన్‌లు పంపిణీ చేయటంతో పాటు కాన్సర్ వ్యాధి గురించి వివరించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు గోళ్ల వరలక్ష్మి, సభ్యులు ఇందుమతి, విజయలక్ష్మి, ప్రిన్సిపల్ అనూష,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీఐ క్విజ్ పోటీలపై విద్యార్థులకు అవగాహన



క్విజ్‌కు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆర్బీఐ క్విజ్ పోటీల అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో రవి, ఇమ్మానియల్‌లు మాట్లాడుతూ క్విజ్ పోటీలు విద్యార్థులకు ఎంతో ఉపయోగమన్నారు. ఇందులో మూడు విడతల ప్రైజ్‌లు ఉంటాయని అవి స్టేట్, జోనల్, నేషనల్ అని తెలిపారు. విద్యార్థులు ఈ నెల 17 తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 19 నుంచి 21 తేదీ రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో క్విజ్ పోటీలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ www.rbi90quiz.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సావిత్రి, అధ్యాపకులు కె.విజయబాబు, శ్రీనివాసాచార్యులు అక్రమ్, రమేష్, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మ తల్లి ఆలయంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

దర్శి: దర్శి పట్టణంలోని కనకదుర్గమ్మ తల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామాభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

పుల్లలచెరువు: వాహనదారులు తగు జాగ్రత్తలు పాటించాలని పుల్లలచెరువు ఎస్ఐ బి.బాబురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆటోడ్రైవర్స్‌కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తప్పని సరిగా ప్రభుత్వం ద్వారా నిర్దేశించి పత్రాలు కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగం, పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించడం, తాగి వాహనాలు నడపడం లాంటివి చేసి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని అన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సావిత్రి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సావిత్రి మాట్లాడుతూ ఓజోన్ పొర అంతరించటం వల్ల మానవాళికి ముప్పు పొంచి ఉందన్నారు. ఓజోన్ పొరను మనం రక్షించుకోవాలంటే తప్పని సరిగా అడవుల నరికి వేతను అరికట్టాలన్నారు. మొక్కలు విరివిగా పెంచి ప్రాణ వాయువును పెంపొందించుకోవాలని సూచించారు. యంత్రాల నుంచి వచ్చే వినాశకర వాయువులను విడుదల చేస్తున్న పరిశ్రమల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో కె.విజయబాబు, శ్రీనివాసాచార్యులు అక్రమ్, రమేష్, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.

బై బై గణేశా



వైఎస్సార్, బూచేపల్లి కటౌట్లతో నృత్యం చేస్తున్న యువకులు



నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

దర్శి: దర్శి పట్టణంలో గణేశ్ నిమజ్జనం వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లంకోజనపల్లి రోడ్డులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నిమజ్జనం సందర్భంగా వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా వార్లు పోసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కటౌట్లతో అధిక సంఖ్యలో యువకులు పాల్గొని సందడి చేశారు.